# మచ్చలూ - మనుషులూ

"చిట్టిబాబుకిక పెళ్ళి కాదు' ఇది వాళ్ళమ్మ అభిప్రాయం.

"పెళ్ళంటే వెనకాముందులాడి, నీళ్ళు నమిలే వెధవలు ఇంతవరకు మా వంశంలోనే లేరు. వీడెలా పుట్టాడో ఏమో?" వాళ్ళ నాన్న దౌటు.

"ఏమే మీ సుందరాంగుడు పెళ్ళి చేసుకోడా? భగ్న ప్రేమికుడా?" ఆఫీసులో లీలా మనొహరన్ ఆసక్తి.

"మిస్టర్ చిట్టిబాబు, ప్రబంధ కావ్యాలు చదివి, మళయాళ సినిమాలు చూస్తూండు. అప్పటిక యినా పెళ్ళంటే ఆసక్తి కల్గుతుందేమో?" స్నేహితుల ఉచిత సలహా.

ఈ విధంగా చిట్టిబాబు వివాహ సమస్య అతి ముఖ్యమైనదిగా పరిగణింపబడి, జాతిని పట్టి పీడిస్తున్న జటిల సమస్యలా ఇంటా బయటాకూడా కదు ప్రాముఖ్యతని సంతరించుకుని దీనిముందు పంజాబు సమస్య, శ్రీలంకలోని తమిళుల సమస్య చటుక్కున అప్రధానమైపోయినాయి.

స్త్రీ బాలవృద్ధులంతా ఏక కంఠంతో ఘోష పెడుతున్నా, సామూహికంగా బాధపడుతున్నా, చిట్టిబాబు ఎందుకలా నిర్లిప్తంగా వుదాసీనంగా ప్రవర్తిస్తున్నాడు? వివాహంపై అంత విరక్తి కలగటానికి గల కారణాలెట్టివి? దీని వెనుక ఏవైనా విదేశీ, స్వదేశీ హస్తాలున్నాయా విజ్ఞులైన మీకు అనుమానం రావటం సహజం.

పెళ్ళిపట్ల విముఖత్వానిక్కారణం, అతడు వికలాంగుడు, కురూపిగానికాదు. అప్పుడే కాగితం విప్పిన టాయిలెట్ సబ్బులా వుంటాడు. సంపాదన లేనివాడా? నిక్షేపంలాటి, వుద్యోగం. పన్చేసినా చెయ్యకపోయినా గూడా నెల తిరిగేసరికల్లా జీతంరాళ్లు చేతిలోపడే ప్రభుత్వ వుద్యోగం పోనీ కుటుంబపు బరువులు బాధ్యతలు ఏవైనా వున్నాయంటే- తండ్రి ఇంకా రెండు చేతులతో సంపాదిస్తున్నాడు.

మరేమిటి రహస్యం- ఎక్కడుంది కీలకం?

చిట్టిబాబుకి వివాహంపట్ల విరక్తి, ఏవగింపు కలగటానిక్కారణం, అతనికాడవాళ్ళంటే తగని ఆసహ్యం, కోపం వగైరా. అతడి మనస్సు ఒకానొక సందర్భంలో చివుక్కుమని, చేజారిన అద్దంలా బీటువారింది.

రెండు సంవత్సరాలక్రితం.

చిట్టిబాబు అందరితోను మెత్తగా సౌమ్యంగా మాట్లాడేవాడు. పసిపిల్లలన్నా, ఆడపిల్లలన్నా చాలా ఇష్టపడేవాడు. మల్లెపూలు సువాసనలు, వెన్నెల చల్లదనాలు అతడిని పరవశింప చేసేవి. దొడ్లో సిగ్గుగా తలలువాల్చే మందారాలు అతడి ఆరాధ్యదైవాలు. అతడెప్పుడ ఎవ్వరినీ ప్రేమించలేదు. ప్రేమనేది భూమిలోంచి పుట్టుకొచ్చే నీటి జలకి మల్లే గుండెల్లోంచి పొంగుకు రావాలిగాని- అనుకుని ప్రేమించట మేమిటి- నాన్‌సెన్స్ అతని అతడి సిద్ధాంతం.

అతడి తల్లితండ్రులు ఒక సంబంధం చూసేరు. అతడు కాదనలేక ఒకరోజు పెళ్ళి చూపులకి కూడా వెళ్ళేడు. ఆ పిల్లతండ్రి బియ్యం వ్యాపారం చేస్తాట్ట, కాని మనిషి మాత్రం కొన్ని సంవత్సరాలుగా తిండి లేనివాడిలా బలహీనంగా వున్నాడు. ఆయన భార్య అతడి వాటాగూడా ఆవిడే తినే స్తోందాన్నట్లుగా లావుగా డ్రమ్ములాగా వుంది. పెద్దవాళ్లు పిచ్చాపాటిలో వుండగా, చిట్టిబాబు కాఫీ చప్పరిస్తుడగా-

ఆ పిల్లని గదిలోకి తీసుకొచ్చారు.

ఆమె వంకలేని చంద్రవంకలావుంది. మొగలి రేకులా, శీతాకాలపు నీరెండలావుంది. కొటేరేసినట్లు ముక్కు, కాటుకెట్టించిన కళ్లు ఎందువల్లనో గాని ఎర్రగా వున్నాయ్. పచ్చటి శరీరపు రంగుకి ఆమె ధరించిన ఎర్రబార్డర్ జరీ చీరె బాగా నప్పింది జడని వదులుగా నిర్లక్ష్యంగా వదిలివేసినప్పటికి ఎంతో ఆకర్షణియంగా అనిపించింది.

చిట్టిబాబుకి పిల్ల నచ్చింది. మాటలు మంతనాల అయ్యేక ముహూర్తాలుగూడా పెట్టేరు.

తెల్లవారితే పెళ్ళి-

బంధువులందరూ సపరివారంగా వచ్చి వాలేరు. ఇల్లంతా గొడవగా, సందడిగా అసెంబ్లీలాగా వుంది. ఆ రోజున అతడిని పెళ్ళి కొడుకుని చేసేరు. కాళ్ళకి పసుపురాసి, మొహాన తిలకం, బుగ్గనచుక్క పెట్టి మెళ్ళో గొలుసుగూడా వేసేరు. పెళ్ళి కూతురికి విసుగు, కోపం జాస్తీట. నీకు వంట చెయ్యటం వచ్చునా, చిట్టీ' అనెవరో జోక్ చేస్తే అందరూ ఘొలుమన్నారు.

అంతా హాయిగా సంతోషంగా వుండగా అతనొచ్చాడు. పిల్ల మేనమామట. నల్లగా, సన్నగా కడ్డీ జుట్టుతో, పంచెకట్టుతో, ఫ్రెంచికట్‌తో, పాత తెలుగు సినిమాలోని హాస్య పాత్రధారిలా వున్నాడు. అతను దొంగలాగా వచ్చాడు. వస్తువస్తూ దారిలో ఎవరినో మర్డర్ చేసివచ్చినట్లు బెరుకుగా భయంగా వచ్చాడు. అతడి వాలకం ఎవ్వరికీ అర్థం కాలేదు. అతడు చిట్టిబాబు తండ్రిని బయటకు పిల్చి పది నిమిషాలు మందార చెట్టు క్రింద నిల్చోబెట్టి, ఏదో విపత్కర పరిస్థితిని గూర్చి వివరించేడు. అటు తర్వాత చిట్టిబాబు తండ్రి భార్యని పిలవటం, మళ్ళీ కాసేపు గుస గుసలు, తల్లి బుగ్గలు నొక్కుకోవటం అంతా పెళ్ళి కొడుకు వేషంలో వున్న చిట్టిబాబు గమనించాడు గాని విషయం మాత్రం అవగాహన కాలేదు. అటుపిమ్మట తల్లి ఆ వచ్చిన వ్యక్తిపై 'ఇంత అర్భనాకారి, అనాకారి సంబంధం అనుకోలేదు. సాంప్రదాయం మంచిదనుకున్నాం. ఇంకా నయం– పెళ్ళికిముందే బయటపడింది. ఎంత నామర్దా–' అంటూ విరుచుకుపడటం. ఆ వచ్చిన మేన (హాస్య) మామ మెల్లిగా జారుకొనటం జరిగింది.

జరిగిన విషయం మెల్లిగా తేటతెల్లమయింది.

పెళ్ళి కూతురు తన ప్రియుడిని చేత్తో పుచ్చుకొని లేచ్చక్కాపోయింది.

అదీ విషయం!

కొద్ది క్షణాల క్రితం వరకు సందడిగా కళకళ్లాడిన ఇల్లు, ఒక్కసారిగా నిశ్శబ్దంగా మారి పోయింది. నిశ్శబ్దంతో చాలా భయంకర గుణం వుందని అప్పుడే

అతనికి అర్ధమైంది. పెళ్ళి కళ పోయి, పీనుగ వెళ్ళిన కొంపలా విషాదంగా మారింది. చివరికి ఏం మాట్లాడాలో అర్థం కాక మూకీ సినిమాల్లో నటుల్లా తలోవైపు నిల్చుండి పోయారు.

చిట్టిబాబు వెంటనే పెళ్ళి కొడుకు అలంకరణని తీసేసాడు. సాదాప్పాంటు షర్టు తొడుక్కున్నాడు. శూలాల్లా పొడుస్తున్న చుట్టాల చూపులని భరించలేక, సరాసరి వెళ్ళి హుస్సేన్ సాగర్ వొడ్డున కూర్చున్నాడు.

అతని కిప్పుడర్థమైంది. ఆ రోజున ఆమె కొటేరేసిన ముక్కు, కాటుక కళ్ళు ఎర్రగా ఎందుకున్నాయో!

అతడి కర్థం కానిదల్లా, ఆ పిల్ల ఆ రోజున– పెళ్ళి చూపులనాడు తనతో, "ఏవండీ, చిట్టిబాబు గారూ, నేను మా యింటి కెదురుగా కొంపలో వుంటున్న ఆ నొక్కుల జుటుటవాడిని, ఎర్రతోలు వాడిని, నాలుగంకెల జీతం, స్కూటరుగల ఆ గోరింకడిని ప్రేమించాను. దయచేసి మాకడ్డు రాకండి' అని చెప్పలేదేమని చదువుకున్నది ఆ మాత్రం చొరవ ధైర్యం, జ్ఞానం లేకుండా అసలు పెళ్ళిచూపులకెందుకని ఒప్పుకున్నట్లు? ఆమె ఆలోచనా రహితంగా చేసిన ఆ పనివల్ల ఆమె కుటుంబం మాటటుంచి, తన కుటుంబ ప్రతిష్ఠ ఎంతగా దెబ్బతింది? పెళ్ళికని వచ్చిన బంధువులు తనని ఓదారుస్తున్నట్లుగా మాట్లాడుతుంటే తనకి తల కొట్టేసినట్లు, వాడైన కత్తితో గుండెని చీలుస్తున్నట్లు, తన మగతనానికి చెదలు పట్టినట్లు...

అదిగో, అప్పటినించి అతడికి ఆడవాళ్ళంటే అసహ్యం, కోపం. తల్లితండ్రులు ఎన్నో విధాల నచ్చచెప్ప ప్రయత్నించేరు. కాని ఫలితం శూన్యం. ఇంక వాళ్ళవల్ల కాక, వీడికిక వివాహప్రాప్తి లేదు అన్న నిజంతో రాజీపడి వూరుకున్నారు. నిజంగా చిట్టిబాబు ఇంట బయటా అనుకుంటున్నట్లుగా బ్రహ్మచారిలాగా వుండిపోయేవాడేమో – ఆఫీసు పనంటూ విజయవాడ వెళ్ళకుండా వుండివుంటే...

ఒకరోజు అనుకోకుండా చిట్టిబాబుని ఆఫీసులో విజయవాడ వెళ్ళాలన్నారు. మిగతా వాళ్ళందరూ తలో మాటా చెప్పి తప్పుకున్నారు. క్రికెట్ మ్యాచ్, పెళ్ళాం పురుడు, పిల్ల వెధవ ఆరోగ్యం, స్వంత అనారోగ్యం వగైరాలు చెప్పి అందరూ తప్పుకున్నారు గాని, చిట్టిబాబు సరైన కారణం చెప్పలేక దొరికిపోయాడు. చివరికి ఆ బాధ్యత అతడిపై ఉంది.

ఆ సాయంత్రం ప్రయాణానికని బట్టలు సర్దుకుంటుంటే విజయవాడ వెడుతున్నాడని తెల్సిన తండ్రి 'చిట్టీ– అక్కడ నీ ఆఫీసు పనయ్యాక, గాంధీనగరంలో పార్వతమ్మ గారని తెల్సినావిడుంది. వెళ్ళి ఒక్కసారి కనబడిరా' అన్నాడు.

చిట్టిబాబు కించిత్తు అనుమానపడ్డాడు. కొంపతీసి మళ్ళీ పెళ్ళి ప్రయత్నాలేమన్నా చేస్తున్నారేమోనని 'ఎవరావిడ– ఏమిటి పని' అనడిగాడు. నేనక్కడ ఉద్యోగం చేసే రోజుల్లో పూర్ణచంద్ర రావని నా కొలీగ్. అతడి భార్య ఈ పార్వతమ్మ. అప్పట్లో అతడికేదో అవసరం వచ్చి కాళ్ళా వేళ్ళాపడితే ఓ మూడువేలు అప్పిచ్చాను. తర్వాత కొన్నాళ్ళకి అతడు అకస్మాత్తుగా పోయేడు. పార్వతమ్మకి విషయం చెప్పగా మెల్లిగా ఇస్తానంది. సరేనన్నాను. చాలాకాలం అయింది. అంచేత ఒకసారి వెళ్ళి గుర్తుచేసిరా' అంటూ ఆమె అడ్రస్సు కాగితాన్ని చేతిలో గుచ్చేడు. అతడు దాన్ని యాంత్రికంగా జేబులోకి బట్వాడా చేసేడు.

అతడికి విజయవాడలో ఆఫీసు పని పూర్తయ్యే సరికే సాయంత్రం అయింది. అందువల్ల మరుసటి రోజు ఉదయాన అడ్రస్సు కాగితాన్ని చేతపుచ్చుకుని బయల్దేరాడు. నిజానికి అడ్రస్సు కనుక్కోవటం అంత కష్టం కాలేదు. ఈ విషయంలో రాజధానికన్నా బెజవాడ బెటరని అనుకున్నాడు కూడా.

పార్వతమ్మ గారుండేది నిజానికిల్లుగాదు. గ్యారేజీషెడ్డు మధ్యన చెక్కగోడ పెట్టి రెండు గదులుగా భ్రమింపజేసేరు. చిట్టిబాబు లోనికడుగుపెట్టేసరికావిడ పడుకునుంది. ఏదో బాధవల్ల కాబోలు సన్నగా మూల్గుతోంది. అతడు తనని తాను పరిచయం చేసుకుని, తదుపరి వూగుడుబల్ల వంటి చెక్క కుర్చీలో కూర్చున్నాడు. ఆవిడలేని ఓపిక తెచ్చుకుంటూ, బాధవల్ల మొహం చిట్లిస్తూ లేచి కూర్చుంది. చిట్టిబాబు వచ్చినపని చెప్పకమునుపే సంజాయిషీ ఇస్తున్నట్లుగా "ఏవిటో నాయినా– మీ నాన్నకి డబ్బివ్వాలంటే కుదిరిచావటం లేదు. ఎన్నేళ్ళో అయింది. ఏమనుకుంటున్నారో ఏమో?" ఆయాసంవల్ల ఒక్కక్షణం ఆగింది. అటు తర్వాత మళ్ళీ. నాకో ఆడపిల్ల పెళ్ళికుంది నాయనా. ఆ మహానుభావుడు పోయేవాడు పోక, నేనెక్కడ సుఖపడిపోతానో అన్చెప్పి పిల్లదాని బాధ్యత నాకప్పజెప్పి మరీ వెళ్ళేడు. సంబంధాలు చూసేవాళ్ళు లేరు. నేనా రోగిష్టిదాన్ని– చూస్తూనే వున్నావుగా'

అని మళ్ళీ క్షణకాలం ఆగి, 'నాకో ఎకరం పొలం వుంది. పిల్ల పెళ్ళి కుదిరితే అది కాస్తా తెగనమ్మి, పిల్లని ఓ అయ్యచేతిలోను, దాంట్లోంచి ఒక మూడువేలు మీ నాన్న చేతిలోను పెడతామని వుంది. ఏదీ కల్సిరావటం లేదు' అని గొంతుని కాస్త పెంచి 'అమ్మా చంద్రా! అబ్బాయికి కాస్త కాఫీ పట్రామ్మా' అని మళ్ళీ చిట్టిబాబుతో 'ఎక్కడ దిగేవు నాయనా' అనడిగింది

చిట్టిబాబు చెప్పాడు.

ఆవిడే మళ్ళీ 'మీ నాన్నగారికేం అదృష్టవంతుడు– బాదర బందీల్లేవు. చక్కటి వుద్యోగం– ఒక్కడే కొడుకు. ఛ్– అలా బతకాలంటే ఏఆనడో పుణ్యం చేసుకోవాలి నాయనా– అందరికీ వచ్చే అదృష్టాలు కావు. అవునూ క్రితంసారి వచ్చినపుడు నీకు సంబంధాలు చూస్తున్నామన్చెప్పారు. పెళ్ళయిందా నాయినా?' అనడిగింది.

చిట్టిబాబు బరువుగా తలూపాడు– లేదన్నట్లు, మొగ పిల్లవాడికేందిగులు లక్షణంగా అవుతుంది. ఆడపిల్లలున్నవాళ్ళకే అవస్థలన్నీను' అని ఆవిడంటూండగా, ఆమె కాఫీగ్లాసుతో వచ్చింది.

చిట్టిబాబు ఆమెవైపు చూసేడు.

ఆమె లేతసూర్యకిరణంలాగ వచ్చింది. జిలుగు జాబిల్లి ఆకాశంలో చుక్కల మధ్యనుంచి జరజరా జారుకుంటూ వచ్చినట్లుగా వచ్చింది. చల్లగాలి రథంలో వచ్చిన రంభలా, వూర్వశిలాగా వచ్చింది.

చిట్టిబాబు చూస్తూనే వున్నాడు.

గుండ్రని మొహం, గీతగీచినట్లు చిన్న నోరు, నగిషీ చెక్కినట్లు ముక్కు, ఆరోగ్యమైన వొంపు సొంపులు, మల్లెలు,మందారాలు కలిపి వొంటికి పట్టించినట్లు మెరుపు, ఎదుటి మనిషిని ఆకట్టుకునే చక్రాల్లాంటి కళ్ళు...

చిట్టిబాబు తనని తాను మరచి అలాగే చూస్తున్నాడు.

ఆమె కాఫీ అంది మెల్లిగా– చిట్టిబాబు తల కదిలించి వర్తమానంలో కొచ్చాడు– తర్వాత సిగ్గు పడ్డాడు. కాఫీగ్లాసు నందుకునేటప్పుడు అప్రయత్నతంగా వ్రేళ్ళుతాకగా అతడికి వొళ్ళు విద్యుత్ ప్రాకినట్లుగా జిల్లుమంది. అంతలో రోగిష్టి పార్వతమ్మ మళ్ళీ 'నా కూతురు పేరు చంద్రకళ. బియ్యే పాసయ్యింది. దీన్ని గురించే నాదిగులంతా' అంటుండగా ఆవిడ మాటల్ని మధ్యలోనే తుంచేస్తూ 'మందుబిళ్ళ వేసుకున్నావా?' అందాపిల్ల విసుగ్గా.

ఆ గొంతు శంకరశాస్త్రిగారి వీణగీతంలా వినిపించింది చిట్టిబాబుకి.

పార్వతమ్మ లేదని తలాడించటంతో ఆమెలోనికెళ్ళింది.

మామూలు సాదా పరికెణి, ఎఱ్ఱఓణి, మెళ్ళో చవకబారు పూసలదండ, చేతులకి మట్టిగాజులు మొదలగు సాధారణ అలంకరణే అయినా ఎంత అందంగా వుంది అనుకున్నాడతను. గత కొద్ది కాలంగా స్త్రీ ద్వేషం విముఖత్వంతో కప్పేసుకుపోయిన మనస్సు మళ్ళీ స్పందించటం మొదలెట్టింది.

చిట్టిబాబు అత్యంత ఆనందాన్ననుభవిస్తూ కాఫీ సేవిస్తుండగా పార్వతమ్మ వున్నట్టుండి, నాయనా నాకో చిన్న సహాయం చేసిపెట్టు. నీకు పుణ్యముంటుంది' అంది.

చంద్రకళని చూసేక అతడికి ఆ కుటుంబం తనకు చాలా కావాల్సినవాళ్లు లాగా, అత్యంత ఆత్మీయులుగా కనిపించసాగేరు. అందువల్ల చాలా ధీమాగా 'ఏం చెయ్యాలో చెప్పండి' అన్నాడు.

అంతలో చంద్రకళ మందుబిళ్ళ, గ్లాసుడు నీళ్లతో వచ్చి ఆరెండింటిని తల్లి కందించింది. పార్వతమ్మ వాటినందుకుంటూ 'అమ్మయ్ నీకు హైద్రాబాద్ ఇంటర్వ్యూ ఏ తారీఖున?' అనడిగింది.

ఆ పిల్ల ఆలోచించుకొని ఈ నెల ఇరవై నాలుగున' అంది.

పార్వతమ్మ ఆ మందు బిళ్ళని పుట్టుక్కున గొంతులోకి గిరవాట్టేసి, గుక్కెడు నీళ్లు త్రాగి, తదుపరి చేదుగా మొహం చిట్లించి 'అమ్మాయికి ఇరవై నాలుగున ఇంటర్వ్యూకి రమ్మనమని కాగితం వచ్చింది. ఆడపిల్ల–నేనా రోగిష్టిదాన్ని ప్రయాణం చెయ్యలేను. మగదిక్కు లేనివాళ్ళం ఎలా వెళ్ళేది, అసలెక్కడి కెళ్ళేది, మా ఖర్మని వూరుకున్నాం. కాని దేవుడిలా సమయానికొచ్చేవ్. నిన్ను చూసాక నాకీ ఆలోచనొచ్చింది. పిల్లదాన్ని ముందురోజు రైలెక్కిస్తాను. కాస్త నువు దగ్గిరుండి ఇంటర్వ్యూ చేయించి మళ్ళీ రైలెక్కిస్తా? నువు సరేనంటే పంపుతాను. కుదరదంటే మానేస్తాను.

అది విన్న చిట్టిబాబుకి ఒక్కసారి ఆ చెక్క కుర్చీలోంచి గెంతి, పైన రేకులని సంతోషంతో గుద్దేసి, మళ్ళీ వచ్చి ఆ వూగుడు కుర్చీలో కూర్చోవాలన్న చిలిపి తలంపు కలిగింది. కాకపోతే ఎంత కాకతాళీయం! తనప్పుడే మనస్సులో అనుకుంటున్నాడు. ఆ పిల్ల ఒంటరిగా తటస్థపడితే తన మనస్సులో ఆమెని చూడంగానే జరిగిన కల్లోలం, తుఫాను, బాధ, ప్రేమ అన్నిటిని ఆమె ముందుంచి నైవేద్యం చెయ్యాలని, అనుకుంటండగానే అవకాశం తన్ను కొచ్చింది.

కాని, ఆ భావాలేవీ కన్పించకుండా దాచేసి, పొడిగా 'అలాగే, తప్పకుండా పంపించండి అన్నాడు.

అపుడా పిల్ల 'వారికేదైనా ఇబ్బంది కల్గుతుందేమో– పోనీలే అంది. అపుడు చిట్టిబాబు కంగారు కంగారుగా 'ఇబ్బందీ లేదు, ఏదీ లేదు. అయినా భగవంతుడి దయవల్ల ఆ వుద్యోగం వచ్చిందంటే పరిస్థితులు కాస్తన్నా చక్కబడతాయిగా' అని పార్వతమ్మని ప్రలోభపెట్టేడు. 'అవునవును, బాగా చెప్పావు నాయనా, తప్పకుండా పంపుతాన్లే' అంది. చిట్టిబాబు అయిష్టంగానే లేచాడు. పార్వతమ్మ మంచంలోంచే 'నాన్నగారితో నే చెప్పిన విషయాలన్నీ చెప్పి, తర్వలోనే ఆ డబ్బు సర్దుబాటు చేస్తానని చెప్పు' అంది ఆయాసంగా.

కొద్దిక్షణాల్లో ఎంత మార్పొచ్చింది– అనుకున్నాడు. ఆ ఇంట్లో కెళ్ళకముందు, తానొక జడ పదార్థం. మనస్సు చచ్చి, స్పందన లాగిపోయిన నిర్వికార, నిరాడంబరుడు. కాని ఇప్పుడు– మనస్సు తిరిగి చైతన్యవంతమయింది. భావాల పరంపరని ప్రసారం చేస్తోంది. తిరిగి ఆశల్ని రేకెత్తిస్తోంది.

హైద్రాబాద్ చేరాక గంటలు, రోజులు లెక్క బెడుతూ ఎదురు చూడసాగేడు. కళ్ళు మూసినా, తెరచినా చంద్రకళ రూపే కన్పించసాగింది. ఆమె ఆలోచనే ఎంతో మధురంగా అన్పించింది. ఇంతటి ఆనందం, ఆశల మూల చిన్న అనుమానం– ఆ పిల్ల కూడా ఇంతకుమునుపే ఎవరినన్నా ప్రేమించేసిందేమోనని, వెంటనే మళ్ళీ ' ఛఛ ఆ పిల్ల అమాయకురాలు, అలాంటిది కాద'ని సమర్థింపు. విజయవాడనించి రాగానే తల్లితండ్రులకి పార్వతమ్మ పరిస్థితి చాలా విషాదంగా, హృదయవిదారకంగా చిత్రించి, వున్నవి లేనివి గుప్పించి చెప్పి, చివరగా 'వాళ్ళమ్మాయికి ఇక్కడ ఇంటర్వ్యూ వుందిట. ఎలాగాని ఆవిడ బాధపడుతుంటే నేనే– పోన్లే పాపమన్నె చెప్పి, ఆ ఒక్కరోజు మా ఇంట్లో వుంటుంది పంపమని చెప్పొచ్చాను. అబ్బ– అటవంటి కష్టాలు పగవాడిక్కూడా వద్దమ్మా' అన్నాడు జాలిగా.

ఆవిడ మరింత జాలిగా 'మంచి పన్చేసేవులే అవన్నీ చూసి పిల్లాడికి మనస్సు బాధపడి పోయిందిలా వుంది. అందువల్లనా అంత ముభావంగా వుంటున్నావ్- చిట్టీ' అన్చెప్పి చాలా ఇదయిపోయింది.

ఎదురుచూసిన ఇరవై మూడో తారీఖు అతికష్టం మీద వచ్చింది. చిట్టిబాబు ఈ రోజుకోసం ఎదురుచూసి చూసి నవమాసాలు మోసిన గర్భవతిలా అలసిపోయేడు. ఆరోజు స్వయంగా తనే స్టేషనుకెళ్ళి ఆమెను రిసీవు చేసుకున్నాడు. ఆమె రైలు దిగిన వెంటనే ఒక్కసారి మాత్రం పలకరింపుగా నవ్వింది. తర్వాత గంభీరంగా మౌనంగా వుండిపోయింది. ఆ రోజు పిల్లవాడు హుషారుగా కళకళ్ళాడటం తల్లిదండ్రులు గమనించారు.

మర్నాడు ఆఫీసుకి శెలవు పెట్టి ఆమెని ఇంటర్వ్యూకి తీసుకెళ్ళాడు. ఆటోలో ఆమెతో కలసి ప్రయాణం చేస్తున్నపుడు, ప్రక్కప్రక్కగా నడుస్తున్నపుడు, ఆమె తన వెనక తలొంచుకుని నమ్మకంగా వస్తున్నప్పుడు ఏదో గొప్ప అనుభూతి చెప్పలేని ఆనందం, స్త్రీ సాంగత్యంలో ఎంతటి ఆనందం వుందోననిపించేటంతటి ఆనందం.

ఆమె మాత్రం ఏం మాట్లాడటంలేదు. ఒకటి రెండు ముక్తసరి సమాధానాలు తప్ప ఇంటర్వ్యూకి చాలామంది రావటం చేతను, ఆమె పేరు, చివరకు పిలవటం చేతను బాగా ఆలస్యమైంది. బయటకొచ్చి ఇద్దరూ నడుస్తున్నారు ప్రక్కప్రక్కగా...

అతనడిగాడు 'ఎలా చేశావ్- ఇంటర్వ్యూ'

'పర్వాలేదు'

'కాఫీ త్రాగుదాం-'

'అబ్బే వద్దండి'- కంగారు.

ప్రక్కనే వున్న ఖరీదైన హోటల్లో కాఫీ త్రాగేరు. బయటికొచ్చాక 'బిర్లామందిర్ చూస్తావా?' అనడిగాడు.

'నే రాత్రికెళ్ళిపోవాలి. అసలే అమ్మ ఆరోగ్యం మంచిది కాదు- ఒక్కతే వుంది. మళ్ళీ ఆలస్యం అవుతుంది? అంది కంగారుకంగారుగా. చిట్టిబాబు చెవిటి వాడిలా, ఆమె మాటలు వినిపించుకోకుండా, చిన్న సందులోంచి కొండపైకి దారితీసేడు. ఆమె అయిష్టంగానే అనుసరించింది. సాయంకాలపు నీరెండ పాలరాతిపై పడి బంగారంలా ప్రకాశస్తోంది. ఆరోజు పెద్దగా జనం లేదు. దేవుడి దర్శనం అయ్యేక, క్రిందికి దిగుతుండగా అన్నాడు చంద్ర- నీతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలి కాస్సేపు అలా కూర్చుందాం అన్నాడు.

ఆమె కంగారుపడింది. విశాలమైన కళ్ళని భయంగా టపటపలాడించింది. అతడు చొరవగా వెళ్ళి విశాలంగా, హాయిగా, ప్రశాంతంగా వున్న మండపంలో కూర్చున్నాడు. కాస్సేపటికామె గూడా వచ్చి అతడికి దూరంగా వొదిగి చూర్చుంది. మెల్లిమెల్లిగా చీకట్లు వ్యాపిస్తుండటం వల్ల నియాన్ దీపాలు వెలిగాయ్. చల్లగాలి వింజామరలు వీస్తున్నట్టుగా హాయిగావుంది.

కొద్దిక్షణాల మౌనం తర్వాత చిట్టిబాబు 'మనిద్దరికి పరిచయం తక్కువ. కాని అదేవిటో నిన్ను ఎన్నో సంవత్సరాలుగా ఎరుగున్నట్లు అన్పిస్తోంది. సరే అదలావుంచు. ఇంతకీ నువ్వెప్పుడన్నా ఎవరినన్నా ప్రేమించావా?' అనడిగాడు.

అనుకోని ఆకస్మిక అంతరంగిక ప్రశ్నవిని ఆమె కంగారుపడింది. అతడివంక భయంగా చూసి 'అబ్బే అటువంటిదేమీ లేదు' అంది.

'నిజంచెప్పు. మనమేమీ చిన్న పిల్లలం కాదు. వున్నది వున్నట్టు చెప్పుకుంటే మనస్సులు ప్రశాంతమౌతాయ్.

చంద్రకళ ఈసారి అతడివంక తీక్షణంగా చేసి "అటువంటిదేమీ లేదు" అంది ఖండితంగా.

ఆ మాటతో చిట్టిబాబుకి ధైర్యం వుత్సాహం రెండూ సమపాళ్ళల్లో వుద్భవించగా సన్నగా' నవ్వుతూ "అంటే నిన్ను ప్రేమించి ఆరాధిస్తున్న మొదటి వ్యక్తిని నేనేనన్నమాట" అన్నాడు.

ఆ మాట విన్న ఆమెలో ఏదోకంగారు. 'అంటే మీ వుద్దేశ్యం-?'

"అవును చంద్రా- ఆ రోజు నిన్ను చూసిన క్షణంలోనే ప్రేమించడం మొదలు పెట్టాను. నిన్ను ఆరాధిస్తున్నాను. నువ్వు సరేనంటే పెళ్ళి చేసుకుంటాను"

అదివిన్న ఆమెలో అతడాశించిన భావాలు కన్పించకపోగా, ఏదో కంగారు భయం స్పష్టంగా గోచరించాయ్. 'వెడదాంపదండి. మళ్ళీ నాబస్సుకి వేళవుతోంది' అంది.

చిట్టిబాబుకి ఆమె వాలకం బొత్తిగా అర్థం కాలేదు ఎందుకలా కంగారు పడుతుంది. తనేమున్నా తప్పుగా మాట్టాడేడా? తొందరపడ్డాడా? మరెందుకంత భయం, కంగారు?

"నేనేమన్నా తప్పుగా మాట్లాడితే క్షమించు. నామనస్సులో మాటవిని మన్నిస్తావని ఆశపడ్డాను ఇంకేదో అనబోతుండగానే ఆమె మధ్యలోనే అందుకుంటూ 'వెళదాం పదండి, బస్సుకి' అని అనబోయింది. కాని ఆమె గొంతుతో ఏ భావం ఏ బాధలు అడ్డుపడ్డాయో మాటని పూర్తి చెయ్యనివ్వలేదు. ఆ గుండెలో ఏ నరం కదిలిందో, ఆ ఆడతనంలో ఏ ఆశ, కోర్కెలు తలెత్తేయోగాని, కళ్లు మాత్రం నీటిని నింపుకున్నాయ్.

ఆమె పమిటకొంగుతో కళ్లు తుడుచుకుంది.

చిట్టిబాబుకి భయంవేసి పోనీలే చంద్రా– నికిష్టం లేకపోతే పోనీలే– బాధపడకు" అన్నాడు అనునయంగా.

అప్పుడు చంద్రకళ మాట్లాడింది. "అదికాదండి– మీకా సంగతి తెలీదు. తెలిస్తే నన్ను ప్రేమించలేరు. పైగా అసహ్యించుకుంటారు"

చిట్టిబాబు అనుమానంగా ఆశ్చర్యంగా "ఏ విషయం గూర్చి నువ్వనేది?" అనడిగాడు.

నియాన్‌లైటుకాంతి ఆమెపై పూర్తిగా పడుతోంది. సందడి పూర్తిగా తగ్గింది. ఒకళ్ళిద్దరు దూరంగా కూర్చుని మాట్లాడుకుంటున్నారు.

"నేకాలేజీలో ఫైనలియర్ చదువుతుండగా ఎంతోమంది కుర్రాళ్ళు నన్ను ప్రేమించానని పెళ్ళి చేసుకుంటానని నాచుట్టూ తిరిగారు. కాని ఆ విషయం తెల్సి మళ్ళీ పత్తాలేరు" అంది.

చిట్టిబాబులో ఆందోళన అధికం అయింది."ఏమిటా విషయం– చెప్పు పర్వాలేదు."

అప్పుడు చంద్రకళ మెల్లిగా పమిటని తొలగించింది. ఆకర్షణీయమైన, ఆరోగ్యమైన చనుద్వయానికి దిగువుగా, బొట్టుకి పై భాగాన అర్ధరూపాయి ప్రమాణంలో, నిప్పుకణికిలా వుంది– తెల్లటి బొల్లిమచ్చ!

చిట్టిబాబు అవాక్కుగా ఆ మచ్చవంక చూస్తున్నాడు. ఆమె కొద్ది క్షణాల తర్వాత తిరిగి పైటని సరిచేసుకుంది. సూటిగా అతడివంక చూస్తూ "ఇప్పుడు నన్ను చూస్తుంటే అసహ్యంగా, భయంగా వుంది కదూ! మీరేకాదు– అంతకుమునుపు ఉపగ్రహాల్లా నా చుట్టూ తిరిగిన వాళ్ళందరూ ఈ మచ్చ గురించి తెల్సుకుని మాయమైనారు. ఇంకో విషయం తెల్సునా?" అంటూ లేచి నిల్చుంది.

చిట్టిబాబు శిలాప్రతిమలా అలాగే కదలికలేక కూర్చుండిపోయాడు.

ఆమె నిల్చొని దూరంగా కన్పిస్తున్న నగర దీపపు కాంతిని పరిశీలనగా చూస్తూ, తనలో తాను మాట్లాడుకుంటున్నట్లుగా 'ఈ మచ్చ చూశాకే మా నాన్న గుండెపగిలి చచ్చేడు. దాన్ని చూస్తే మా అమ్మ దిగులుతో మంచం ఎక్కింది. మొదట్లో సూదిమొనలా పుట్టింది. పెసరగింజలాగా పెరిగి, పావలాకాసంత ఎదిగింది, నేడు అర్ధరూపాయంత, రేపు రూపాయంత ఆపైని భూమితల్లి మోస్తున్న పాపమంతగా పెరిగి...'

కాని చిట్టిబాబుకి ఏ మాటా విన్పించటం లేదు. అతడాలోచిస్తున్నాడు. మనుషల నైజాల్లో వైవిధ్యం, ఆలోచనా ధోరణులలోని వ్యత్యాసం, ఎదుటి మనిషిని మోసం చెయ్యటాని కిచ్చగించక తమ జీవితాలని త్యాగం చేసే మహనీయత్వం, తన సుఖం కోసం ఎదుటిమనిషి పరువు మర్యాదలని తృణప్రాయకంగా చూసే భయంకరమైన స్వార్ధ ప్రవృత్తి...

చిట్టిబాబుకి అన్ని విషయాలు కళ్ళకు కట్టినట్లు' జ్ఞాననేత్రం తెరచుకున్నట్లుగా కన్పించసాగాయ్, తాను మొదటపెళ్ళిచూపులు చూసి, మనస్సు పడ్డ ఆ పిల్ల తన స్వార్ధంకొద్దీ తల్లితండ్రుల పరువు ప్రతిష్ఠలని, తమ కుటుంబహోదాని మంటగలిపి చెప్పా పెట్టకుండా పారిపోయింది. అదే ఈ పిల్ల తన శరీరపు మచ్చని దాచుకోకుండా నిర్భయంగా, ఎవరినీ మోసగించటానికిచ్చగించక వున్నదున్నట్లుగా చెప్పి జీవితానికి తన చేతులతో తానే సమాధి కట్టుకుంటోంది. జీవితాల వాకిట్లో ఎంతటి పరస్పర విరుద్ధమైన

 భావాల తోరణాలు!

చిట్టిబాబు ఆలోచిస్తూనే వున్నాడు. మంచిని చెడుని, నిజాయితీ దగాలని, శరీరం మనస్సులని తూకం కట్టి ఆలోచిస్తున్నాడు. అలా ఆలోచిస్తున్న అతడికి కనిపించింది. శరీరం రుగ్మతలకి గ్యారంటీ ఏమిటి? ఇవాళలేని జబ్బు రేపు రాకూడదా? అలాగే వున్న జబ్బు పోకూడదా? పెళ్ళయ్యాక బయటపడితే ఏం చేస్తాం? నిన్న, ఇవాళ, రేపు ఆపైన కూడా నిత్యము సత్యము అయింది మనస్సు. గదా! మరటువంటప్పుడు తనకున్న మచ్చని ధైర్యంగా, నిజాయితీగా బయటపెట్టినందుకు శిక్షించటం భావ్యమా?

చిట్టిబాబు తెప్పరిల్లి చూశాడు–

చంద్రకళ అప్పటికే వెళ్ళిపోయింది. ఎక్కడికెళ్ళిది, ఎలా వెళ్ళింది?

చిట్టిబాబుకి కంగారు భయం అధికం అయినాయ్.

శరీరాలని ఆశ్రయించుకునే ప్రేమ బొల్లిమచ్చలకి, చీడకురుపులకి బాధపడుతుంది. కాని మనస్సుల నాశ్రయించుకునే ప్రేమ వీటన్నిటికి అతీతమైన స్థితిలో వుంటుంది.

అందువల్లనే, చిట్టిబాబు ప్రేమతో నిండిన ఆదుర్దాతో చంద్రకళని కల్సుకోవటానికి కదిలేడు.